# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 19-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ 3 దేశాల విదేశీ పర్యటన ముగించుకొని ఈ రోజు స్వదేశానికి చేరుకున్నారు.
- ❖ విద్యను వ్యాపార కోణంలో చూడకూడదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు వారణాసిలో పర్యటించనున్నారు.
- ❖ జాతీయ మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా విజయ రాహత్కర్ నియమితులయ్యారు.
- ❖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైనిక కార్యకలాపాల్లో విప్లవాత్మక మార్పులు చేసే అవకాశం ఉందని రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

=========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ 3 దేశాల విదేశీ పర్యటన ముగించుకొని ఈ రోజు స్వదేశానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా మూడు ఆఫ్రికన్ దేశాలైన అల్జీరియా, మౌరిటానియా, మలావిలలో పర్యటించారు. జీ - 20 కూటమిలో ఆఫ్రికన్ యూనియన్ శాశ్వత సభ్యునిగా చోటు దక్కించుకున్న తరువాత భారత రాష్ట్రపతి ఆ దేశాల్లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ద్రౌపది ముర్మ 3 దేశాల నాయకత్వంతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అలాగే ఆ దేశాలతో భారత్ కు ఉన్న స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయని ఈ పర్యటన అనంతరం రాష్ట్రపతి పేర్కొన్నారు.

=========================

విద్యను వ్యాపారీకరణ చేయడం వల్ల విద్యా నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈరోజు జరిగిన ఒక విద్యా సంస్థ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... విద్య

వ్యాపారంగా మారడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. విద్య ఎప్పుడూ ఆదాయ వనరు కాదని, త్యాగాల మాధ్యమంగా, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఉపయోగపడుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు వారణాసిలో పర్యటించనున్నారు. ఆయన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమయిన వారణాసిలో 6 వేల 600 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. అందులో భాగంగా ఆర్జే శంకర్ కంటి ఆసుపత్రి ప్రారంభిస్తారు. వారణాసి విమానాశ్రయం విస్తరణ, కొత్త టెర్మినల్ భవనానికి కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం  సిగరా స్పోర్ట్స్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

==========================

జాతీయ మహిళా కమిషన్ నూతన చైర్ పర్సన్‌గా విజయ రాహత్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. విజయ రాహత్కర్ ఇదివరకు మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గానూ, ఔరంగాబాద్ మేయర్‌గా పని చేశారు. గతంలో ఆమె భారతీయ జనతా పార్టీ  జాతీయ కార్యదర్శిగా, ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కూడా పని చేశారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా డాక్టర్ అర్చన మజుందార్ ను నియమించినట్లు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది.

==========================

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రక్షణ వ్యవస్థను బలోపేతం చేసి సాయుధ దళాల భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 62వ నేషనల్ డిఫెన్స్ కాలేజీ ఎం.ఫిల్ స్నాతకోత్సవ వేడుకల్లో కేంద్రమంత్రి ప్రసంగించారు. ప్రస్తుతం యుద్ధం భూమి, సముద్రం, ఆకాశం లాంటి  సాంప్రదాయ యుద్ధ క్షేత్రాలను అధిగమించిందని అన్నారు. సాయుధ దళాలు ఇప్పుడు బహుళ-డొమైన్ వాతావరణంలో పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)కు సైనిక కార్యకలాపాలలో విప్లవాత్మక మార్పులు చేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆయన  పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

==========================

వాణిజ్యం, పెట్టుబడి రంగాల్లో సహకారాన్ని పెంపొందించకోవడానికి మెక్సికో సిటీలో ఈరోజు జరిగిన భారత్ - మెక్సికో ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఇరు దేశాలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమోటివ్ రంగాల్లో పెట్టుబడులకు భారతదేశం అద్భుతమైన అవకాశాలను అందిస్తోందని అన్నారు. భారతదేశం  మెక్సికోల ఉమ్మడి ప్రయత్నాలు వైవిధ్యత ద్వారా స్థితిస్థాపకతను బలోపేతం చేయగలవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

==========================

ముంబై నుంచి కొలంబోకు ప్రయాణిస్తున్న విస్తారా ఎయిర్‌లైన్స్ UK 131 విమానానికి బాంబు బెదిరింపులు రావడంతో ఈరోజు శ్రీలంకలోని బండారునాయకే అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఆ తర్వాత విమానాశ్రయంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. 96 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో ఉన్న ఈ విమానం సురక్షితంగా విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యిందని విమానాశ్రయ అధికారులు నిర్ధారించారు.

==========================

జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ.. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించిన విషయాలపై  ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమయ్యేందుకు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా త్వరలో ఢిల్లీ వెళ్లనున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా జమ్మూ కశ్మీర్ మొదటి శాసనసభా సమావేశం నవంబర్ 4న జరగనుందని  క్యాబినెట్ పేర్కొంది. కొత్తగా ఎన్నికైన అసెంబ్లీ సభ్యులతో ప్రమాణం చేయించేందుకు ముబారిక్ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు.

==========================

హర్యానాలోని కర్నాల్ లో ఉన్న “ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వీట్ అండ్ బార్లీ రీసెర్చ్” ఈరోజు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 13 కొత్త రకాల గోధుమ విత్తనాల పంపిణీని ప్రారంభించింది. దేశం నలుమూలల నుండి 22 వేల మంది రైతులు ఈ విత్తనాల కోసం పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. ఈ కొత్త రకాలు అన్ని వ్యాధులను తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడిని ఇస్తాయి. పొట్టు రహితమైన DWRV-137 బార్లీ రకాన్ని కూడా ఈ జాబితాలో చేర్చారు. ఇది పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుంది. గత సంవత్సరం రికార్డు స్థాయిలో 113.29 మిలియన్ టన్నుల గోధుమల ఉత్పత్తిని సాధించామని, ఈ సంవత్సరం 115 మిలియన్ టన్నుల గోధుమలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ సంచాలకులు డాక్టర్ రతన్ తివారీ తెలిపారు.

==========================

తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక సహా దేశంలోని దక్షిణ ప్రాంతాల్లో రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అండమాన్ నికోబార్ దీవుల్లో రేపు, సోమవారం కూడా ఇదే విధమైన పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్, ఒడిశాలో కూడా ఈ నెల 23, 24వ తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది.

==========================

ఆర్చరీ వరల్డ్ కప్ ఫైనల్ - 2024 ఈరోజు మెక్సికోలో ప్రారంభమయ్యింది. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో వ్యక్తిగత పురుషులు, మహిళల పోటీలు ఈ ఫైనల్లో ఉంటాయి. భారత్ తరపున ఐదుగురు ఆర్చర్లు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జ్యోతి సురేఖ వెన్నం, దీపికా కుమారి, ధీరజ్ బొమ్మదేవర, ప్రియాంష్, ప్రథమేష్ ఫుగే ఫైనల్లో అగ్రస్థానం కోసం పోటీ పడనున్నారు. ఈరోజు రాత్రి 9.30 గంటలకు పురుషుల వ్యక్తిగత విభాగంలో పోటీలు ప్రారంభమవుతాయి.

==========================

==========================